బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పోరాటం

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ):కాంగ్రెస్ ఇచ్చిన బీసీ హామీ అమలయ్యే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. బీసీల నాయకత్వాన్ని ప్రోత్సహించింది బీఆర్ఎస్సేనని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీసీ ముఖ్యనాయకులతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడులో వారి పర్యటనపై చర్చించి సూచనలు చేశారు. బీసీలకు చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో అత్యధిక అవకాశాలు కల్పించామని, రాబోయే రోజుల్లోనూ మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, నేతలు రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్యగౌడ్, గౌరీశంకర్, శుభప్రదపటేల్, కిశోర్‌గౌడ్, అంజనేయగౌడ్, ఉపేంద్రాచారి, పల్లె రవికుమార్‌గౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చిరుమల్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమం

- సమగ్ర కులగణనకు చట్టబద్ధతే లక్ష్యం
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి తీరాలి
- 28న కల్వకుర్తిలో సమగ్ర కులగణనపై సభ
- తెలంగాణ బీసీ మహాసభ సమావేశంలో వక్తలు

తెలంగాణ బీసీ మహాసభ జెండాను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్, బాలరాజు యాదవ్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24: సమగ్ర కులగణ, బీసీ రిజర్వేషన్ల పెంపే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ బీసీ మహాసభ జెండా విష్కరణ సభలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే కామారెడ్డి డిక్లరేషన్ కేవలం బీసీల ఓట్ల కోసమే నాడు చేసినట్టున్నదని, దానిని అమలుచేసి తీరాల్సిందేనని వక్తలు డిమాండ్ చేశారు. 76 ఏండ్లలో ఒక్క బీసీ ముఖ్యమంత్రి కాలేకపోయాడని ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు తొలినాళ్ల నుంచి బీసీలను ఓట్లుగానే చూశాయి తప్ప రాజ్యాధికారంలో వారికి స్థానం ఇవ్వలేదని తెలిపారు. ఐదు శాతం కూడా లేనివారే ఆ పదవులను అనుభవిస్తూ వస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం బీసీలు చైతన్యవంతులయ్యారని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల్లోబడుగు, బలహీనవర్గాలే ఎక్కువ మంది బాధితులుగా మారుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బడుగు, బలహీనవర్గాల ప్రాతినిధ్యం పెరగాలని, ఆ వర్గాలన్నీ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సీఎం కొడంగల్ నియోజకవర్గంలోని నారాయణపేట ఎత్తిపోతల పథకానికి టెండర్లు ఖరారాయ్యాయని, రూ.2,300 కోట్ల టెండర్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మేఘా కృష్ణారెడ్డికే వచ్చాయని, ఇందులో బీసీల కోటా ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో బీసీల కోటా ఎంత ఉంటుందో చెప్పాలని మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ప్రశ్నించారు. సమగ్ర కులగణనపై 28న కల్వకుర్తిలో బీసీ మహా ధర్నాను నిర్వహించనున్నట్టు తెలిపారు. సభలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ సురేశ్ ముదిరాజ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిడికిలి రాజు, కేవీ గౌడ్, నిర్మాత, నటి కీర్తి లతాగౌడ్, బీసీ నాయకులు నిర్మల శ్రీశైలంగౌడ్, సీఎల్ శ్రీనివాస్ యాదవ్, దాసరి కిరణ్, నరేశ్ ముదిరాజ్, వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి కృష్ణయ్య రాజీనామా

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తన సభ్యత్వానికి సోమవారం సమర్పించిన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ మంగళవారం బులెటిన్‌ను విడుదల చేశారు. ఏపీకి చెందిన వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తన పదవీకాలం మరో నాలుగేండ్లపాటు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 11 స్థానాలకు అన్నిస్థానాల్లో వైసీపీ గెలుచుకుని సంఖ్యాబలం పరంగా రాజ్యసభలో నాలుగో అతి పెద్ద పార్టీగా నిలిచింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం వైసీపీ రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ రాజీనామాలు సమర్పించారు. వారిబాటలో ఆర్ కృష్ణయ్య రాజీనామా చేయడంతో వైసీపీకి రాజ్యసభలో సంఖ్యాబలం తగ్గింది.

వచ్చే పంటకైనా నీళ్లివ్వండి

- విమర్శలు మాని రైతులకు నీరందించండి
- పాలమూరు -రంగారెడ్డి 90 శాతం పూర్తి
- మా మీద కోపంతో పనుల్లో జాప్యం వద్దు
- 10 నెలల తర్వాత ప్రాజెక్టు వద్దకు మంత్రులు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : వచ్చే పంటకాలానికైనా పాలమూరు – రంగారెడ్డి పథకం నుంచి సాగునీటిని అందించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. పది నెలల తర్వాత ప్రాజెక్టును చూసేందుకు మంత్రులు బుధవారం వస్తున్నారని, వారి పర్యటనను బీఆర్ఎస్ స్వాగతిస్తున్నదని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని తెలిపారు. కేవలం కాలువ పని ఉన్నదని, దీనికి కూడా టెండర్లు గతంలోనే పిలిచామని వివరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, బొమ్మెర రామ మూర్తితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వలసల పాలమూరును పచ్చబడేలా చేశారని, పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత ఆయనదేనని స్పష్టంచేశారు. పాలమూరులో లక్షల ఎకరాలను కొత్తగా సాగులోకి తెచ్చారని గుర్తుచేశారు. తాము పిలిచిన టెండర్లను కొనసాగించి ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదని, ఈ వానకాలం పంటలకే నీళ్లు వచ్చేవని, కనీసం వచ్చే పంటలకైనా నీళ్లివ్వాలని సూచించారు.

గతంలో కరువును చూపి అప్పులు

గతంలో పాలమూరుకరువును చూపి ప్రపంచ బ్యాంక్ నుంచి అప్పులు తెచ్చేవారని, ఆ నిధులను ఇతర పనులకు ఖర్చు చేసేవారని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా రైస్ మిల్లుల్లోకి ధాన్యం పుళ్లుగా వచ్చిందని చెప్పారు.కాంగ్రెస్ మంత్రులు భేషజాలకు పోకుండా పాలమూరు పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. తమ మీద కోపంతో పనులను ఆలస్యం చేయవద్దని, ఎప్పుడు ప్రాజెక్టు పూర్తి చేస్తారో స్పష్టం చేయాలన్నారు. వట్టెం పంపుహౌస్ మునక బాధ్యులపైనా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రుల పర్యటన పాలమూరు రైతులకు భరోసా ఇచ్చేదిగా ఉండాలని, రాజకీయ విమర్శలకు తావివ్వకుండా రైతుల కోణంలో ఆలోచించాలని సూచించారు. చెక్ డ్యామ్‌లు, కాలువల పనులు పూర్తి చేయడంపై మంత్రులు దృష్టి పెట్టాలని, రిజర్వాయర్లు, లిఫ్టుల వారీగా సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఇప్పుడు మంత్రిగా ఉన్న జూపల్లికి కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పురోగతి తెలుసునని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనానికి త్వరలోనే తమ పార్టీ బృందం తమిళనాడులో పర్యటిస్తుందని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు వారంలో విధివిధానాలు

- అక్టోబర్ 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి విధివిధానాలు ఖరారు చేసి అక్టోబర్ 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడతామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పొంగులేటి ఈ వ్యాఖ్యలు చేశారు.

కాల్వలు తెగడానికి కారణమెవరు?

- దీనిపై విచారణకు సిద్ధమా?
- మంత్రి ఉత్తమ్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సాగునీటి కాల్వలు తెగడానికి ఎవరు కారణమో తేల్చేందుకు విచారణకు సిద్ధమా? అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం సాగర్ ఎడమ కాల్వ గండి మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్ పరిశీలించిన సందర్భంగా ఎడమ కాల్వకు గండ్ల పాపం గత ప్రభుత్వ నిర్వాకం అనడంపై జగదీశ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు బీఆర్ఎస్‌పై నిందలు వేస్తారా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఐదేండ్లలో చేయాల్సిన తప్పులను పది నెలల్లోనే చేసిందని, ప్రజలు అన్నీ లెక్కకడుతున్నారని అన్నారు. మంత్రులు తమ వైఫల్యాలను అధికారుల మీద నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దుర్మార్గంగా గేట్లకు లాకులు, వెల్డింగులు పెట్టడంతోనే కాల్వలు తెగాయని, ఈ విషయం తెలిసినప్పటికీ 24 రోజుల తరువాత ఆలోచించి కాల్వ గండ్లపై పచ్చి అబద్ధాలు ఆడటం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మం మంత్రుల అత్యుత్సాహం, నల్లగొండ మంత్రుల చేతగానితనంతోనే సాగర్ ఎడమ కాల్వ కట్టలు తెగిపోయాయని ఆరోపించారు. హడావిడి పనులతో నాసిరకంగా మరమ్మతులు చేస్తున్నారని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి కింది స్థాయి అధికారుల మీద అరవడం మానుకొని, పొలాలకు నీళ్లు అందించాలని హితవుపలికారు.24 రోజులు గడుస్తున్నా పొలాలకు నీళ్లు అందడం లేదని, మంత్రులు పరిపాలన వదిలి ఇల్లు చక్కబెట్టుకునే పనిలో పడ్డారని విమర్శించారు. గతంలో కాల్వలు తెగితే వారం రోజుల్లోనే నీళ్లందించిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే 24 గంటలు షిఫ్టుల వారీగా పనిచేయించి మరమ్మతులు పూర్తి చేసి పొలాలకు నీళ్లందించాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌తో బీజేపీ నేతల కుమ్మక్కు

- అమృత్ స్కాంపై మాట్లాడరేం?
- స్కాంపై కేంద్రమంత్రి స్పందన హాస్యాస్పదం
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బీజేపీ నేతలు కాంగ్రెస్ పెద్దలకు కొమ్ముకాస్తున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. అమృత్ స్కాంపై బీజేపీ కేంద్ర మంత్రుల మాటలు చూస్తుంటే ఇవి నిజమనిపిస్తున్నదని చెప్పారు. అమృత్ స్కాం పై కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి స్పందనల తీరు హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌కు లేఖ రాయాలని కోరడం విచిత్రంగా ఉన్నదని, రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలను కాపాడే పనిలో బండి సంజయ్ ఉన్నట్టు అర్థమవుతున్నదని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి కేంద్రంలో మంత్రిగా ఉండటం దురదృష్టకరమని విమర్శించారు. తనపైనే ఆరోపణలు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సీవీసీ, సీబీఐకి లేఖ రాస్తుందా? అని ప్రశ్నించారు. ఇదే అంశంపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మహేశ్వర్ రెడ్డి సీబీఐ, ఈడీ విచారణ చేయాలని మాట్లాడి ఇప్పుడు నోరెందుకు మెదపడం లేదని నిలదీశారు. అమృత్ మీద మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు. ఇప్పుడు సీబీఐ విచారణ కోరాలని మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్నది మీ పార్టీయే కదా? అని ధ్వజమెత్తారు. మోదీ ఎక్కడికెళ్లినా బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్ర నిధులు ఏటీఎంగా మారాయంటారని, మరి అమృత్ నిధులు తెలంగాణలో దుర్వినియోగమవుతుంటే విచారణకు ఎందుకు ఆదేశించరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి కూడా నోరు మెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ అవినీతి మీద బీజేపీ ఉద్యమిస్తుంటే తెలంగాణలో నోరు మూసుకున్నదని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా అమృత్ స్కాంపై విచారణ కోసం బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

గండి పడి నీళ్లు లీక్ అయిన ప్రాంతంలో మరమ్మతుల తరువాత ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఎట్టకేలకు నీళ్లిచ్చారు!

- యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత
- ఖమ్మం రైతులకు సాగర్ జలాలు
- కాలువ నీటిని పరిశీలించిన మంత్రి పొంగులేటి
- ఇరిగేషన్‌అధికారులపై ఆగ్రహం

కూసుమంచి, సెప్టెంబర్ 24: ఎట్టకేలకు నాగార్జునసాగర్ ఆయకట్టులోని ఖమ్మం జిల్లా రైతులకు సాగునీటిని విడుదల చేసింది. పాలేరు కాలువకు గండిపడి పొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ పెట్టి సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి కాలువ పనులు వేగంగా చేయాలని ఆదేశించారు. దీంతో లీక్ అయిన ప్రాంతంలో సోమవారం నుంచే అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. ఎట్టకేలకు మంగళవారం తెల్లవారుజాము నుంచి నీటిని విడుదల చేశారు. కాగా, ఈ నీటి ప్రవాహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. తదుపరి చర్యల గురించి ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. జిల్లాకు పూర్తిగా సాగునీరు అందించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలపై వారితో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలు ఆదేశాలు జారీచేశారు. ఇటీవలి వరదలకు పాలేరు కాలువకు గండి పడగా శనివారం అధికారులు దానిని పూడ్చారు. ఆ తరువాత ట్రయల్ రన్‌లో కాలువ నీళ్లు మరోసారి లీక్ అయ్యాయి. దీంతో యూటీని పేల్చి వేసి దానిని డమ్మీ చేశారు. అక్కడ జమ కూడే నీటిని నాలుగు 100 హెచ్‌పీ మోటర్ల ద్వారా తిరిగి నేరుగా కాలువలోకి తరలించాలని నిర్ణయించారు. మంత్రులు పొంగులేటి, తుమ్మల మరమ్మతుల పనులను పరిశీలించారు. లీకేజీ పనులను కూడా ఎట్టకేలకు పూర్తి చేసి మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు రింగ్‌బండ్ తీసేసి క్రమంగా నీటిని వదిలారు. మొదట 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమంగా సామర్థ్యాన్ని పెంచుతూ మంగళవారం రాత్రి వరకు 2000 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బుధవారం ఉదయం వరకు మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదలకు ప్రణాళిక రూపొందించారు.

హరీశ్‌రావు ఎఫెక్ట్

ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం

నీటిని వదిలిన తరువాత కాలువ ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి.. ఎఫ్‌టీఎల్, కెనాల్ లెవెల్, బండ్ లెవల్ వంటి గణాంకాలను ఇరిగేషన్ అధికారులను అడిగారు. వారు సమాచారాన్ని ఇవ్వలేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు అధికారులను నియమించి గంటగంటకు దాని ప్రోగ్రెస్‌ను కలెక్టర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఈఈ అనన్య, డీఈ మధు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

బండ్ ఎత్తు పెంచి పూర్తిస్థాయిలో నీళ్లివ్వాలి: పొంగులేటి

బండ్ ఎత్తును పెంచి బుధవారం వరకు జిల్లాలోని చివరి ఆయకట్టు రైతులకు కూడా పూర్తిస్థాయిలో నీటిని అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ ఎత్తును ఇంకా ఐదు అడుగుల మేర పెంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. బుధవారం ఉదయం వరకు ఈ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ ముత్తయ్యనాయుడు మంత్రికి తెలిపారు.

రైతు ఇంటి తలుపులు పీకేసిన బ్యాంకర్

- అప్పు చెల్లించలేదని డీసీసీబీ అధికారుల దౌర్జన్యం
- స్థానికులు ఎదురుతిరగడంతో జారుకున్న అధికారులు

నెన్నెల, సెప్టెంబర్ 24 : అప్పు చెల్లించడం లేదన్న సాకుతో బ్యాంకు అధికారులు ఓ రైతు ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. సదరు రైతు ఇంటి తలుపులు ఊడబీకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో పారిపోయారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. నెన్నెలకు చెందిన రైతు గట్టు శివలింగయ్య, అతని తమ్ముడు భానేష్ కలిసి తల్లి పేరిట ఉన్న భూమి తనఖా పెట్టి దాదాపు 8 ఏండ్ల క్రితం భూమి అభివృద్ధి కోసం రూ.2 లక్షలు, శివలింగయ్య తన పేరిట రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. అప్పు తీసుకున్న పట్టాదారైన శివలింగయ్య తల్లి నాలుగేండ్ల కిందట చనిపోయింది. అయినప్పటికీ విడతల వారీగా డబ్బులు చెల్లిస్తూ వస్తున్నారు. ఆరు నెలల క్రితం శివలింగయ్య రూ.20 వేలు బ్యాంకులో చెల్లించాడు. ఈ క్రమంలో మంగళవారం డీసీసీ బ్యాంకు అధికారులు.. రైతు శివలింగయ్య ఇంటికి వచ్చి తీసుకున్న అప్పు చెల్లించాలని పట్టుబట్టారు. రూ.3.60 లక్షల వరకు అప్పు ఉన్నదని, మొత్తం కట్టాలని ఒత్తిడి చేశారు. తన వద్ద అంత డబ్బులేదని, ఇప్పుడు రూ.20 వేలు చెల్లిస్తానని విన్నవించుకున్నాడు. పూర్తిగా చెల్లిస్తేనే సరి.. లేదంటే ఇంట్లో ఏముంటే అదిపట్టుకుపోతామని బెదిరించారు. దాదాపు రెండు గంటలపాటు వేడుకున్నా వినలేదు. చివరకు ఇంటి తలుపులను అధికారులు ఊడదీశారు. చుట్టుపక్కల వారు వచ్చి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వద్ద ఉన్న డబ్బులను కడతానంటే ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. పేద రైతును ఇలా బజారుకు ఈడుస్తారా? అని మండిపడ్డారు.

తలుపులను ఊడదీస్తున్న బ్యాంకు అధికారి

బ్యాంకు అధికారులు ఊడదీసి పెట్టిన తలుపు

ఊడదీసిన తలుపులు ఎలా తీసుకెళ్తారో చూస్తామని స్థానికులు ఎదురు తిరగడంతో అధికారులు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి డీసీసీబీ మేనేజర్ సురేశ్‌ను 'నమస్తే' ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

రెండ్రోజుల్లో రైతులకు పరిహారం

- కేంద్ర వరదసాయం అందలేదు
- మీడియాతో మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు మరో రెండు రోజుల్లో పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి మంగళవారం తుమ్మల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రంగా పంట నష్టపోయిన జిల్లాల నుంచి నివేదికలు అందాల్సి ఉన్నదని తెలిపారు. కేంద్రం నుంచి ఇప్పటివరకు వరద సాయం అందలేదని అన్నారు. తక్షణ సాయంగా కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు కోరినట్టు చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గండిపడిన పాలేరు కాల్వ మరమ్మతు విషయంలో నీటిపారుదల శాఖ అధికారుల మధ్య సమన్వయలోపమే ఆలస్యానికి కారణంగా గుర్తించామని, అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలోని రైతు వేదికకు తాళం వేస్తున్న రైతులు

మాఫీ రాలేదని రైతువేదికకు తాళం

- నమ్మి ఓటేస్తే.. నోట్లో మట్టికొట్టిన్రు
- రుణమాఫీపై సీఎం మాట తప్పిండు
- 2 లక్షల వరకు మాఫీ చేయాలి: రైతుల డిమాండ్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24: 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మా నోట్లో మట్టికొట్టిండు. పంద్రాగస్టున రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిండు. ఇప్పటికైనా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలె. వానకాలం సీజన్ ముగుస్తున్నందున రైతుభరోసాకు నిధులు కేటాయించాలి' అని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికకు మంగళవారం రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని.. ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

రుణమాఫీపై ఎమ్మెల్యే నిలదీత

మొదటిపేజీ తరువాయి...

రైతుభరోసా ఇవ్వాలని, ఆసరా పింఛన్లు క్రమం తప్పకుండా పెంచి ఇవ్వాలని మహిళలు నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని గ్రామంలోని 143 మంది రైతులకు రూ.4.17 కోట్లను మాఫీ చేశామని, కేవలం ముగ్గురికి రాకపోతే గొడవ చేయడం సరికాదన్నారు. ఒకే రేషన్‌కార్డుపై ఇద్దరు, ముగ్గురు రైతులు ఉన్నందున మాఫీ కాలేదని తెలిపారు.

- సాగునీటి కోసం రైతుల ఆందోళన

కాలువల ద్వారా సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామ రైతులు మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఇచ్చోడ–సోనాల రోడ్డుపై దాదాపు వంద మందికిపైగా రైతులు బైఠాయించారు. పదిహేను రోజులుగా వర్షాలు పడకపోవడంతో చేతికొచ్చిన పత్తి ఎండి పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. – బజార్‌హత్నూర్

ఇద్దరు రైతుల ఆత్మహత్య

- దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపం
- జనగామ, రంగారెడ్డి జిల్లాల్లో బలవన్మరణాలు

మల్లేశం(ఫైల్)

నర్సింహ(ఫైల్)

లింగాలఘనపురం/కందుకూరు, సెప్టెంబర్ 24: దిగుబడులు సరిగా రాక.. అప్పులు తీర్చేమార్గంలేక జనగామ, రంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘన